క్లుప్తంగా

మండల స్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభం



గొడుగుమామిడిలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ హనుమంతరావు

జి.మాడుగుల: శ్రీరామనవమిని పురస్కరించుకుని పెదలోచలి పంచాయతీ గొడుగుమామిడి గ్రామంలో ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను సొలభం సర్పంచ్ ఐసరం హనుమంతరావు బుధవారం ప్రారంభించారు. క్రికెట్ ఆడే క్రీడాకారులను ఆయన ఉత్సాహపరిచారు. అనంతరం సొలభం పంచాయతీ డి.కంఠవరం గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు మోహన్‌రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కుమ్మూరులో ఫీవర్ సర్వే

చింతూరు: మండలంలోని కుమ్మూరు పంచాయతీలో సర్పంచ్ ముచ్చిక నాగార్జున ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటా ఫీవర్ సర్వే చేశారు. వలంటీర్లు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు బృందంగా వెళ్లి సర్వే జరిపారు. జ్వరం, దగ్గు, ఛాతీనొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకుని ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో వివరాలు నమోదు చేశారు.

పవనగిరి క్షేత్రంలో నక్షత్ర శాంతి పూజలు



పవనగిరి క్షేత్రంలో నక్షత్ర శాంతి హోమం నిర్వహిస్తున్న అర్చకుడు

అడ్డతీగల: పవనగిరి క్షేత్రంలో బుధవారం బ్రహ్మశ్రీ అయ్యప్పశర్మ నక్షత్ర శాంతి పూజలు నిర్వహించారు.పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య ఆధ్వర్యంలో ముందుగా శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్లకు అభిషేకం చేశారు.అనంతరం స్వామి అమ్మవార్లకు కుంకుమార్చన నిర్వహించారు.నవగ్రహారాధన, నక్షత్ర శాంతి హోమం చేశారు. అడ్డతీగల,వై.రామవరం మండలం కోట ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

102 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కొయ్యూరు: రామ్‌కీ ఫౌండేషన్,నాబార్డు ఆధ్వర్యంలో బుధవారం మంపలో వైద్య శిబిరం నిర్వహించారు. 102 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. రాజేంద్రపాలెం వైద్యులు సంపత్ బాబు మాట్లాడుతూ వేసవిలో వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. రామ్‌కీ ఫౌండేషన్ ప్రతినిధి హరికృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చెట్టుపై నుంచి పడి గిరిజనుడికి తీవ్ర గాయాలు

మారేడుమిల్లి : చెట్టుపై నుంచి పడిపోవడంతో ఓ గిరిజనుడికి తీవ్ర గాయాలయ్యాయి. వై.రామవరం మండలం చింతలపూడి గ్రామానికి చెందిన పి.అబ్బాయి రెడ్డి గ్రామ సమీపంలోని తన పొలం వద్ద కట్టెల కోసం బుధవారం చెట్టు ఎక్కాడు. ప్రమాదశాస్తు జారి కింద పడ్డాడు. దీంతో చేతులుకాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. అతనిని బంధువులు రంపచోడవరం పీహెచ్‌సీకి తరలించారు.

మాలివలసలో భూ రీ సర్వే

దుంబ్రిగుడ: మండలంలోని సొవ్వా పంచాయతీ మాలివలసలో బుధవారం భూ రీసర్వే ప్రారంభించారు. రైతులు తమ భూములను సక్రమంగా రీ సర్వే చేయించుకోవాలని వీఆర్వో శెట్టి రవి కోరారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ సంగీత తదితరులు పాల్గొన్నారు.

వీవోఏల ఆందోళన

కొయ్యూరు: వెలుగులో పనిచేస్తున్న వీవోఏల కాలపరిమితిపై విధించిన ఆంక్షలను రద్దు చేయాలని డిమాండ్‌చేస్తూ మండలంలో బుధవారం ఆందోళన చేశారు. వీవోఏల ఆందోళనకు వామపక్షాలు మద్దతు తెలిపాయి.

శరవేగంగా వంతెనల నిర్మాణం

ఐదు గ్రామాల ప్రజలకు తీరనున్న వెతలు



లక్కవరం వద్ద వంతెనపై శ్లాబును నిర్మిస్తున్న కూలీలు

చింతూరు: మండలంలోని కంసులూరు, లక్కవరం వద్ద సోకిలేరు వాగుపై చేపట్టిన వంతెనల నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. వర్షాల కారణంగా ఇప్పటి వరకూ నిర్మాణంలో జాప్యం జరిగింది. ఈ పనులు పూర్తయితే గవళ్లకోట, చౌలూరు, మిట్టవాడ, చదలవాడ, ఏరువాడ గ్రామాల గిరిజనుల కష్టాలు తీరుతాయి. మండలంలోని చదలవాడ పంచాయతీ పరిధిలోని గవళ్లకోట, చౌలూరు, మిట్టవాడ, చదలవాడ, ఏరువాడ గ్రామాల చుట్టూ సోకిలేరు వాగు ప్రవహిస్తోంది. వర్షాకాలం వచ్చిందంటే చాలు ఈ గ్రామాల ప్రజలకు నరకయాతనే. జులై నుంచి సెప్టెంబరు వరకు కురిసే వర్షాలకు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇళ్లకే పరిమితమవుతారు. అత్యవసర సమయాల్లో వాగు దాటేందుకు ప్రయత్నించి పదుల సంఖ్యలో గిరిజనులు మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి. వర్షాకాలంలో ఆయా గ్రామాలకు చెందిన ప్రజలకు వైద్యసేవలు, పింఛన్లు, విద్య, నిత్యావసర సరకులు సకాలంలో అందని పరిస్థితి.

వంతెనల మంజూరు ఇలా

ఐదు గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించేందుకు 2018–19లో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన(పీఎంజీఎస్‌వై) కింద మూడు వంతెనలు మంజూరయ్యాయి. సోకిలేరు వాగుపై రూ.3.59 కోట్లతో కంసులూరు వద్ద, రూ.3.05 కోట్లతో లక్కవరం వద్ద, చిలకవాగుపై రూ.1.34 కోట్లతో గవళ్లకోట, చదలవాడ నడుమ వంతెనల నిర్మాణాలు అదే ఏడాది ప్రారంభమయ్యాయి. వంతెనలకు అనుసంధానంగా చింతూరు నుంచి వేగితోట, కంసులూరు, చదలవాడ, మిట్టవాడ మీదుగా తులసిపాక వరకు 17 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణం కూడా చేపట్టాల్సి ఉంది. కాగా చింతూరు నుంచి కంసులూరు వరకు 8 కిలోమీటర్ల మేర ఇప్పటికే రహదారి పూర్తికాగా మరో 9 కిలోమీటర్ల రహదారి నిర్మించాల్సి ఉంది.

వర్షాలతో జాప్యం

2021లో ఈ వంతెనల నిర్మాణం పూర్తి కావాలి. ప్రతి ఏడాది వర్షాకాలంలో మూడు నుంచి నాలుగు నెలలపాటు పనులు నిలిచిపోతుండడంతో పనుల్లో జాప్యం జరుగుతోంది. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరదనీటితో వర్షాకాలంలో సోకిలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుంటుంది. ఆ ఉధృతిలో ఇక్కడ పనులు చేపట్టడం అత్యంత ప్రమాదకరం కావడంతో పనులు నిలిపివేస్తారు. అక్టోబరు రెండో వారం వరకు కూడా వాగు ఉధృతి అలాగే ఉంటుంది. ప్రస్తుతం కంసులూరు వద్ద నిర్మిస్తున్న వంతెనకు సంబంధించి పిల్లర్లపై ఏడు శ్లాబ్‌లు నిర్మించాల్సి ఉండగా మూడు శ్లాబ్‌లు పూర్తయి, నాలుగో శ్లాబ్ నిర్మాణంలో ఉంది. లక్కవరం వద్ద నిర్మిస్తున్న వంతెనకు సంబంధించి ఆరు శ్లాబ్‌లు నిర్మించాల్సి ఉండగా ఒకటి పూర్తవగా రెండో శ్లాబ్ నిర్మాణంలో ఉంది. పనులను మరింత వేగవంతంగా చేసి వర్షాలకు ముందే వంతెనల నిర్మాణాలు పూర్తి చేయాలని ఆయా గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

వర్షాలకు ముందే పూర్తిచేయాలి

వంతెనలు లేకపోవడంతో ఐదు గ్రామాల గిరిజనులు చాలా కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే వంతెనల నిర్మాణం బాగా ఆలస్యమైంది. ప్రస్తుతం పనులు ప్రారంభించినందున వర్షాలు రాకముందే నిర్మాణాలు పూర్తిచేయాలి.

– చిచ్చడి మురళి, ఎస్టీ కమిషన్ సభ్యుడు

ఏప్రిల్ చివరి నాటికి పూర్తిచేస్తాం

కంసులూరు, లక్కవరం వద్ద సోకిలేరు వాగుపై నిర్మిస్తున్న వంతెనల పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఇప్పటికే వంతెనలు పూర్తి కావాల్సి ఉన్నా భారీ వర్షాల కారణంగా వాగు ఉధృతికి పనులు నిలిచిపోయాయి. ఏప్రిల్ చివరి నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం

– ఆచారి, పంచాయతీరాజ్ ఏఈ, చింతూరు

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించారు. మొదటి రోజు పలువురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. అన్ని కేంద్రాల వద్ద పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించారు. పలు కేంద్రాలను తహసీల్దార్లు, సంబంధిత అధికారులు తనిఖీ చేశారు.



జి.మాడుగులలో ఇంటర్మీడియెట్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు



హుకుంపేటలో పరీక్షలు రాసేందుకు వెళుతున్న విద్యార్థినులు



అరకులోయ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద వేచి ఉన్న విద్యార్థులు

మారేడుమిల్లి/చింతూరు/వీఆర్‌పురం/రాజవొమ్మంగి/వై.రామవరం/కూనవరం/అరకులోయ రూరల్/అనంతగిరి/పెదబయలు/ముంచంగిపుట్టు/హుకుంపేట/జి.మాడుగుల/కొయ్యూరు/సీలేరు: రంపచోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 349 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 328 మంది హాజరయ్యారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు కళాశాల సెంటర్‌లో 234 మంది విద్యార్థులకు గాను 218 మంది హాజరైనట్టు చీఫ్ సూపరింటిండెంట్ కృష్ణ తెలిపారు. మారేడుమిల్లి గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో 230 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 220 మంది హాజరయ్యారని, పదిమంది గైరాజరయ్యారని ఏపీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు తెలిపారు. చింతూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 251 మందికి గాను 214 మంది విద్యార్థులు హాజరయ్యారు. 37 మంది గైర్హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ రఘురాం తెలిపారు. వీఆర్‌పురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 95 మందికి గాను 79 మంది విద్యార్థులు హాజరయ్యారు. 16 మంది గైర్హాజరైనట్టు ప్రిన్సిపాల్ సాయి రమణ తెలిపారు. రాజవొమ్మంగి గిరిజన సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో జరిగిన ఇంటర్ పరీక్షలకు 317 మందికి గాను 305 మంది విద్యార్థులు హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ విజయమోహనరావు తెలిపారు. ఈ కేంద్రంలో స్థానిక గిరిజన బాలికల గురుకుల జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, టెన్‌ప్లస్ కళాశాలల విద్యార్థినీవిద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. వై.రామవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షకేంద్రంలో 127 మందికి గాను 122 మంది పరీక్ష రాశారు. ఈ కేంద్రాన్ని స్థానిక తహసీల్దార్ తాతారావు, డిప్యూటీ తహసీల్దార్ కె.సుధాకర్ తదితరులు తనిఖీ చేశారు. కూనవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొత్తం 225 మంది విద్యార్థులకు గాను 210 మంది పరీక్షలకు హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ బి.చంద్రశేఖర్ తెలిపారు. 15 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు చెప్పారు.

అరకులోయ నియోజకవర్గంలో..

అరకులోయ మండల కేంద్రంలో మూడు సెంటర్లలోపరీక్షలు జరిగాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 427 మందికి గాను 385 మంది విద్యార్థులు హాజరయ్యారు. గురుకుల బాలుర కళాశాలలో 327 మందికిగాను 311 మంది, యండపల్లివలస బాలికల గురుకుల కళాశాలలో 340 మందికి గాను 317 మంది విద్యార్థులు హాజరైనట్టు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు తెలిపారు. అనంతగిరి మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పరీక్షలు మొదటిరోజు ప్రశాంతంగా జరిగాయి. 152 మంది విద్యార్థులకు గాను, 139 మంది పరీక్షకు హాజరయ్యారు. పెదబయలు ఏపీ గురుకుల రెసిడెన్షియల్ కళాశాలలో బుధవారం జరిగిన ఇంటర్మీడియెట్ పరీక్షలకు పెదబయలు గురుకుల కళాశాల, కస్తూర్బా గాంధీ బాలికల కళాశాలల నుంచి 251 మంది విద్యార్థులకుగాను 232 మంది విద్యార్థులు హాజరయ్యారు. 19 మంది గైర్హాజరైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ చీఫ్ రాంనాయక్ తెలిపారు. డిపార్టుమెంట్ అధికారి దామోదర్, కస్టోడియన్ అధికారి మురళి తదితరులు పర్యవేక్షించారు. ముంచంగిపుట్టులో 196 మందికి గాను 186 మంది పరీక్షలకు హాజరయ్యారు.10 మంది గైర్హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాన్ని ఎంపీడీవో కిరణ్‌కుమార్ పరిశీలించారు. హుకుంపేట జూనియర్ కళాశాలలో జరిగిన ఇంటర్మీడియెట్ పరీక్షలకు స్థానిక ప్రభుత్వ కళాశాల,కేజీబీవీ, జ్ఞానసాగర్ ఒకేషనల్ ప్రైవేట్ కళాశాలలకు చెందిన 309 మంది హాజరయ్యారని, 37మంది గైర్హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ సింహాచలం నాయుడు తెలిపారు.

పాడేరు నియోజకవర్గంలో..

జి.మాడుగుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో గురుకులం, కేజీబీవీ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు చెందిన 432 మంది విద్యార్థులకు గాను 408 మంది హాజరయ్యారు. 24మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కొయ్యూరు మండలం కాకరపాడు జూనియర్ కళాశాలలో 138 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం పరీక్షలకు 48మంది విద్యార్థులు హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ సాయిరామ్ తెలిపారు.



ముంచంగిపుట్టులో పరీక్ష రాసి వస్తున్న ఇంటర్ విద్యార్థులు



రంపచోడవరంలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



కూనవరం పరీక్షకేంద్రంలో హాల్‌టికెట్ల పరిశీలనకు క్యూలో నిలుచున్న విద్యార్థులు

వారపు సంతలో ఆకుకూరలకు డిమాండ్



విక్రయించేందుకు ఆకుకూరలను తెచ్చిన గిరిజనుడు

అనంతగిరి: మండలంలోని కాశీపట్నం వారపు సంతలో ఆకుకూరలకు డిమాండ్ పెరిగింది. సారవాని పాలెం, మండపర్తి, సీతంపేట గ్రామాల్లో గిరిజనులు ఆకుకూరలను సాగుచేస్తున్నారు. బుధవారం వారపు సంత కావడంతో ఆకుకూరలను విక్రయించేందుకు తెచ్చారు. మైదాన ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు వాటిని భారీగా కొనుగోలుచేశారు. తోటకూర కట్ట రూ.10 నుంచి రూ.15 వరకు గిరిజనులు అమ్మకాలు సాగించారు.

ఘనంగా నూకాలమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ



హుండీ వితరణగా అందిస్తున్న దాత

గొలుగొండ: డివిజన్ ప్రజల ఆరాధ్యదైవమైన లింగంపేట నూకాలమ్మతల్లి ఆలయంలో బుధవారం ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఏటా కొత్త అమావాస్య సందర్భంగా తొమ్మిది రోజుల పాటు ఘనంగా ఉత్సవాలు, తీర్థం నిర్వహిస్తారు. గతేడాది దేవదాయ శాఖ నుంచి రూ. 26 లక్షలు మంజూరు కావడంతో నూతనంగా ఆలయ నిర్మించారు. తాజాగా అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి, అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిన్నయ్యపాలెంకు చెందిన సన్యాసమ్మ, కుమారుడు సాయి ఆలయానికి హుండీ వితరణగా అందజేశారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ బొందల నూకరత్నం, రాష్ట్ర శెట్టి బలిజ డైరెక్టర్ బొందలరాజు, వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, సర్పంచ్ తోకల సంతోష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజిషియన్ శిబిరంలో 37మందికి వైద్యసేవలు



రోగులను పరీక్షిస్తున్న మెడికల్ ఆఫీసర్లు

రాజవొమ్మంగి: మండలంలోని మర్రిపాలెం, దాకరాయి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో 37 మందికి వైద్యసేవలు అందించారు. రాజవొమ్మంగి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ లిఖిత, 104 డాక్టర్ నాగార్జున, ఆశ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

మూగజీవిని రక్షించిన యువకులు



దూడను బయటకు తీస్తున్న యువకులు

రాజవొమ్మంగి : కారు కింద ఇరుక్కున్న ఆవుదూడను స్థానిక యువకులు గమనించి కాపాడారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట ఈ సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకొంది. ఆగి ఉన్న ఓ కారు కిందకు వెళ్లి ఆవుదూడ పడుకొంది.

గమనించని వాహనచోదకుడు కారును స్టార్ట్ చేసి ముందుకు పోనివ్వసాగాడు. దీంతో అది కారు కింద ఇరుక్కుంది. స్థానికులు చూసి ఆ ఆవుదూడను కారు కింద నుంచి అతి ప్రయాసతో బయటకు తీశారు.

రహదారి మరమ్మతులు ప్రారంభం



పొక్లెయిన్‌తో పనులు చేస్తున్న సిబ్బంది

కొయ్యూరు: కాకరపాడు–కొయ్యూరు రహదారి మరమ్మతుల పనులను చేపట్టారు. రోడ్డు అంచులను సరిచేస్తున్నారు. రూ.25 లక్షల వ్యయంతో నాలుగు కిలోమీటర్ల మేర ప్యాచ్ వర్క్ చేయనున్నారు. జేఈ ప్రసాద్ మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా పనులను పూర్తి చేయిస్తామని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి



బొడ్డుగూడెంలో పథకాల గురించి వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చింతూరు: పథకాల లబ్ధిదారుల సమస్యలు తెలుసుకుని, పరిష్కారానికి కృషి చేయాలని ఎస్టీ కమిషన్ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి అన్నారు. మండలంలోని అల్లిగూడెం, బొడ్డుగూడెంలలో బుధవారం సచివాలయాల కన్వీనర్లు, గృహసారథుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. ఈ పథకాలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయో, లేదో తెలుసుకుని, అందని వారికి అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత సచివాలయ కన్వీనర్లు, గృహసారథులపై ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో తిరిగి పార్టీ అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ యడమ అర్జున్, పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి శ్యామల విజయ్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ కోట్ల కృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు సున్నం నాగరాజు, సర్పంచ్‌లు పాయం చంద్రయ్య, సవలం సత్తిబాబు, ఉప సర్పంచ్ భూక్యా బాబూరావు, ఉమాశంకర్, జోగయ్య, కృష్ణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామస్తులకు ప్రభుత్వ పథకాల గురించి పార్టీ నాయకులు అవగాహన కల్పించారు.

చిన్నారులు, గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ఐసీడీఎస్ సీడీపీవో నీలిమ



అవగాహన కల్పిస్తున్న సీడీపీవో నీలిమ

దుంబ్రిగుడ: అంగన్‌వాడీ కేంద్రానికి వస్తున్న చిన్నారులు, గర్భిణులు,బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీడీపీవో నీలిమ అన్నారు. అరమ పంచాయతీ జుర్రిపాడు,అరమ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆమె సందర్శించి, రికార్డులు పరిశీలించారు. అనంతరం చిన్నారులకు పెడుతున్న పౌష్టికాహారాన్ని పరిశీలించి, అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని, ఆకుకూరలను ఎక్కువగా తీసుకోవాలన్నారు.

హైస్కూల్‌కు వాటర్ ప్లాంట్, ప్రింటర్ అందజేత



వాటర్ ప్లాంట్, ప్రింటర్‌ను అందజేస్తున్న శివప్రసాద్, పాల్‌రాజ్ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం

కొయ్యూరు: నేనుసైతం చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు కె.శివప్రసాద్ సూచన మేరకు తెలంగాణ రాష్ట్రం భద్రచలానికి చెందిన పాల్‌రాజ్ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం స్థానిక హైస్కూల్‌కు బుధవారం వాటర్ ప్లాంట్,ప్రింటర్‌ను అందజేసింది. ఇంజినీరింగ్ కళాశాల చైర్‌పర్సన్ వరలక్ష్మితో కలిసి శివప్రసాద్ వాటిని అందజేశారు.ఈ సందర్భంగా శివ ప్రసాద్ మాట్లాడుతూ కనీస సౌకర్యాలు లేని పాఠశాలలను గుర్తించి వాటిని దత్తత తీసుకునేందుకు యోచిస్తున్నట్టు చెప్పారు. అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్,పాఠశాల హెచ్‌ఎం టి.రామారావు, బీఎస్ఎన్ఎల్ కేంద్ర సలహా కమిటీ సభ్యుడు ఎస్.కిరణ్, ఎంపీటీసీ బాబూరావు, శేఖర్ పాల్గొన్నారు

దంత వ్యాధులు, నోటి క్యాన్సర్‌పై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

రంపచోడవరం: ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవ సందర్భంగా ఈనెల 13 నుంచి 20వ తేదీ వరకు ప్రభుత్వ కళాశాల విద్యార్థులు, ప్రజలకు దంత వ్యాధులు, నోటి క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దంత వైద్యులు డాక్టర్ కె.మందు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నోటి ఆరోగ్య సూత్రాలు, నోటి క్యాన్సర్ దాని పర్యవసానాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సతీష్, వరకుమారి, నిరంజన్, నాగు, సామాజికవేత్త సాదల పవన్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



వై.రామవరం ఎస్‌బీఐ సిబ్బందితో యూనియన్ నేతలు

వై.రామవరం: బ్యాంకు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ నాయకులు తెలిపారు. స్థానిక స్టేట్‌బ్యాంకులో బుధవారం భోజన విరామ సమయంలో ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వారు వివరించారు. ఉద్యోగుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సమావేశంలో అమరావతి సర్కిల్ ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ పాపారావు, రీజినల్ ఇన్‌చార్జ్ శ్రీనివాసరావు, రీజినల్ సెక్రటరీ విజయబాబు, స్థానిక బ్రాంచి మేనేజర్ యు.నాగరాజు, హెడ్ క్యాషియర్ ఆర్.డి.ఎస్.ఎస్.కె. దీపక్, క్యాషియర్ బి.సాయిశ్రీనివాస్, క్లర్క్ ముర్ల వీర్రాజు పాల్గొన్నారు.

అమ్మవారి జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు



ప్రత్యేక అలంకరణలో నూకాలమ్మ అమ్మవారు

నర్సీపట్నం: దేవదాయ శాఖ ఆధ్వర్యంలో పట్టణ ఇలవేల్పు నూకాలమ్మ అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఏటా కొత్త అమావాస్య జాతర అత్యంత వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అదే విధంగా ఈ ఏడాది అమ్మవారి జాతర బుధవారం నుంచి ప్రారంభమైంది. మంగళవారం రాత్రి అమ్మవారి మొదటి జాగారం, 17న రెండో జాగారం, 20న మూడో జాగారం, 21న అమ్మవారి జాతర నిర్వహించనున్నారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చేభక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, ఆలయ కమిటీ వారు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. క్యూలైన్లు ఏర్పాటు చేశామని, భక్తులకు తీర్థ ప్రసాదం అందించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని అధికారులు తెలిపారు.

18న వాహనాల వేలం

నర్సీపట్నం: ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 33 వాహనాలను ఈ నెల 18న బహిరంగ వేలం వేయనున్నామని నర్సీపట్నం ఎస్ఈబీ స్టేషన్ సీఐ జి.శ్రీనివాసు తెలిపారు. ఎంవీఐ నిర్ధారించిన ధర నుంచి బహిరంగ వేలం వేస్తామన్నారు. ఇందులో పాల్గొనే వారు ముందుగా రూ.5 వేలు బయానా కట్టాలన్నారు. వేలంలో వాహనాలు పొందలేని వారికి నగదు వాపసు చేస్తామన్నారు. వేలంలో పాల్గొనే వారు ఉదయం 8 గంటలకు ఎస్ఈబీ స్టేషన్‌కు రావాలన్నారు.

19న చిన్నారుల ఉచిత ఆధార్ శిబిరం

రావికమతం: టి.అర్జాపురం గ్రామ సచివాలయంలో ఈ నెల 19న చిన్నారులకు ఆధార్ కార్డులు జారీ చేసే ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నారు. ఐదేళ్లలోపు పిల్లలకు నమోదు చేయడానికి చిన్నారి జన్మదిన ధ్రువీకరణ, తల్లి లేదా తండ్రి ఆధార్ కార్డు తీసుకురావాలని నిర్వాహకుడు నాయుడు సూచించారు.